# వయస్సు

"ఇవ్వాళ నేను సమర్తాడుతా!" అంది కనకం.

"కాదు నేనే సమర్తాడుతా!" అని నేను పట్టుపట్టాను.

కనకం ఏడుపు మొగం పెట్టింది.

"అట్టయితే నేను ఆడను ఫో-" అని అలిగింది. తను తీసికొచ్చిన ప్లాస్టిక్ పన్నీరు బుడ్డీ, హారతి పళ్ళెమూ తీసికుని వెళ్ళిపోవటానికి సిద్ధమయింది.

కనకం నిజంగా వెళ్ళిపోతుందేమోనని మాఅందరికి భయమేసింది. అదిగనుక వెళ్ళిపోయిందంటే ఆట ఆగిపోవల్సిందే. ఎందుకంటే అది చక్కగా మంగళహారతులు పాడుతుంది. దానికి మినహా మాలో మిగతా ఎవరికీ పాటలు పాడటం రావు. పయిగా, దానితో పాటే అది తీసికొచ్చిన పన్నీరుబుడ్డీ, హారతి పళ్ళెమూ వెళ్లిపోతాయి - పేరంటమూ, కుర్చీలో కూర్చోవటం మంగళహారతులివ్వటం, పాటలు పాడటం ఇవన్నీ వుండవు మరి.

నాకేమో నేనే సమర్తాడి (ఆటలో) సమర్త వేడుకలన్నీ జరిపించుకోవాలని మహా సరదాగా వుంది. అసలు, సమర్తలకు అన్ని వేడుకలు చేస్తారని. దీనికి చాలా తంతు వున్నదనీ మా పెద్దక్కయ్య పుష్పవతి అయినప్పుడు మొదటిసారిగా నాకు తెల్సింది.

మా రాజక్కయ్య పుష్పవతి అయినప్పుడు మా యింట్లో పెద్ద పండుగలాగా వేడుకలన్నీ జరిపించారు. మా అమ్మ హడావుడి అయితే యిక చెప్పనే అక్కర్లేదు. పచ్చి తాటాకులు తెప్పించింది, వాటి మీద రాజక్కను కూర్చోపెట్టారు. ఆమెకు చీర కట్టపెట్టారు. ఆ రోజు సాయింత్రం యిరుగు పొరుగు వాళ్ళందర్నీ పేరంటానికి పిలిచారు. సుందరమ్మత్తయ్యా, సుశీల వదినా కలిసి మంగళహారతులు పాడారు.

వచ్చిన వాళ్ళకు మా భాగ్యం పిన్ని కాళ్ళకు పసుపు రాసింది! అమ్మ గంధం పూసింది. అందరికి చిమ్మిరి వుండలు, పళ్ళూ తాంబూలాలూ యిచ్చారు. వచ్చిన వాళ్ళందరూ రాజక్కను పలకరించారు. వరసయిన వాళ్లు సరసమాడారు. రాజక్కను చూస్తుంటే నాకు బలే సరదాగా వుంది. అప్పటివరకు లంగాలు కట్టినది ఒక్కసారిగా చీర కట్టేసరికి బుట్టబొమ్మ లాగా వుంది. సిగ్గుతో తల వంచుకుని మునగదీసికుని కూర్చుంటే చూట్టానికి నిజంగానే బొమ్మలాగా వుంది! చేత్తో తాకి చూడబోయాను. "దాన్ని తాకకూడదే గుంటా!" అని మా అమ్మమ్మ నా రెక్క పుచ్చుకుని లాగింది.

పదకొండవ రోజున అక్కయ్యకు పుష్పస్నానం చేయించారు. మా నాన్నగారు శుభలేఖలు అచ్చువేయించి అందరికీ పంపించారు. ఆనాటికి పొరుగూళ్ళ నుంచి కూడ మా బంధువులు చాలమంది వచ్చారు. సమర్తపంక్తి పెట్టి వూళ్లో వాళ్లను భోజనాలకు పిలిచారు. చాలమంది అక్కయ్యకు సిల్కు లంగాలు, వోణీలు తీసికొచ్చారు. మొత్తంమీద దానికి ఆరో ఏడో లంగా వోణీలు వచ్చాయి. ఇక రవిక గుడ్డలయితే లెక్కేలేదు. ఇవన్నీ కాక మళ్లీ మా నాన్నగారు రెండు పట్టులంగాలు, వాటిమీదకు జార్జెట్ వోణీలు, ముఖమల్ జాకెట్లూ తీసికొచ్చారు; ఒక జరీచీర కూడా కొన్నారు. జరీ చెప్పులు కూడ తెప్పించారు.

ఆ రోజు అక్కయ్యకు కొత్త జరీ చీరకట్టి మల్లెపూల జడవేశారు. కుర్చీలో కూర్చోబెట్టారు. అందరూ చుట్టూ మూగి హారతులిచ్చి పాటలు పాడారు. నిజంగా అప్పుడు మా రాజక్కయ్య ఒక దేవకన్య లాగానో, యువరాణి లాగానో వుంది. నాన్నగారు ఫోటోగ్రాఫర్ను తీసికొచ్చి అక్కయ్యకు ఫోటోలు తీయించారు. ఆ ఫోటోలకు తర్వాత ఫ్రేంలు కట్టించి మా యింట్లో గోడలకు వ్రేలాడ కట్టారు.

అప్పటికి నా కారేళ్లు. మా పెద్దక్కయ్యకు జరిగిన ఆ వేడుకలూ, అచ్చట్లూ, ముచ్చట్లూ నా పసిమనస్సు మీద వేసిన ముద్ర మసకబారి పోకుండానే మా చిన్నక్కయ్య వంతు వచ్చింది. నాకు తొమ్మిదో యేడు కూడ వచ్చింది. మా రాజక్కకు జరిగినంత ఆర్భాటంగా జరక్కపోయినా మొత్తానికి మా చిన్నక్కయ్య అరుణకు కూడా ఫోటోలు తీయించారు. మా ఇంటి హాలులో గోడలకు మా ఇద్దరక్కల ఫోటోలు వ్రేలాడాయి. ఇకపోతే, వాటికి తోడుగా నా ఫోటో కూడా వ్రేలాడాలన్నమాట!

మా అమ్మమ్మ కూడ అదేమాట అంది. నా గురించి అలా అనగానే నాకెందుకనో బలే సిగ్గేసింది. నేను, 'ఛీ-పో!' అని అన్నాను. పైకి అలా అన్నా, అమ్మమ్మ అలా అనడం నాకు లోపల సరదాగానే వుంది. మా ఇద్దరక్కయ్యలు లాగానే నేనుకూడా ఆ వేడుకలన్నీ జరిపించుకోవాలని, ఆ పదిరోజులూ నేనూ అందరిచేత ప్రత్యేకంగా గొప్పగా చూడబడాలని మనస్సులో తెగ సంబరపడి పోయాను. ఏ ఆడపిల్లకు మాత్రం ఇలా అనిపించదు?

అమ్మమ్మ అన్నదానికి, "ఐనవాళ్లు చాల్లే! ఇక ఇది కూడా ఐతే అప్పటికి గాని బాగుండదు" అని అమ్మ అంది. ఆ మాట దిగులుతో అన్నమాటేనని నాకు తర్వాత అనిపించింది.

వయస్సు ఆగుతుందా? నా వంతూ వచ్చింది.

ఆ రోజు ఏం జరిగిందో నా కిప్పటికీ బాగా గుర్తుంది. నేనివన్నీ ఎందుకు చెప్తున్నానంటే- మనం ప్రతి దానికీ ఏ లోకాన్ని చూచి భయపడిపోతామో, గడగడా వణికిపోతామో, అదెక్కడ తప్పుపట్టుతుందోనని తెల్లారిలేచిన దగ్గర్నుంచి మనం 'మనం'గా కాకుండా, దానికి బానిసలుగా అడుగులకు మడుగు లొత్తుతుంటామో, ఆ లోకం (లోకం అంటే ఎందరో కాదు! కేవలం నలుగురే! 'నలుగురూ ఏమంటారు?' అని గింజుకొని చస్తూ వుంటామో. ఆ 'నలుగురు' అన్నమాట!) పసి మనస్సులను ఎంత క్రూరాతి క్రూరంగా నలిపివేస్తుందో, వాళ్ళ పసిడి కలలను ఎలా ధ్వంసం చేస్తుందో మీరందరూ తెల్సుకుంటారని!

ఇంతకీ ఆరోజు ఏమైంది?

నేను మధ్యాహ్నం భోజనానికి ఇంటికి వచ్చి మళ్ళీ స్కూలుకు బయలు దేరాను. కొద్ది దూరం వెళ్లేసరికి నాకు వూరికే కాళ్లు లాగసాగాయి. గుండెల్లో ఎందుకో దడ. వళ్ళు వూరికే వణికిపోతుంది. చెమటల్లు తెగ పోస్తున్నాయి. నాకేదో భయం భయంగా కంగారుగా వుంది. కాలు ముందుకు పడటం లేదు. నాకేం అయిందో నాకు తెల్సిపోయింది మొగ్గ రేకలు విప్పుకుని పువ్వుగా మారడంతో పోల్చదగ్గ సహజసిద్ధమైన ప్రకృతి కార్య; పిల్ల, 'కన్నెపిల్ల'గా మారే క్షణాలు - నా జీవితంలో సంభవించ బోతున్నాయన్నమాట!

నిన్న రాత్రి ఇల్లు కాలుతున్నట్లు, ఎర్రటి మంటలు పైకి లేస్తున్నట్లు, ఎర్ర మందారాలు గుత్తులు గుత్తులుగా వ్రేలాడుతున్నట్లు నాకు కల రావడం ఇందుకేనన్నమాట!

వెనక్కి తిరిగి యింటిదారి పట్టాను. నడుస్తుంటే నా అడుగులు తడబడుతున్నాయి. నా కళ్లముందు పచ్చి తాటాకులు, తెల్లచీరకట్టుకుని నేను తలవంచుకుని కూర్చోవటం, పేరంటాళ్లు నాకు మంగళ హారతులిచ్చి పాటలు పాడటం, నాకు పుష్పస్నానం చేయించటం, కొత్తబట్టలు, సిల్కువోణీలు, జరీచీర, కొత్త చెప్పులు, మల్లెపూల జడ, ఫోటో తీయించడం, అమ్మలక్కలాడే సరసోక్తులూ, నవ్వులూ, నా కళ్లముందు బొమ్మలు బొమ్మలుగా కనిపిస్తున్నాయి. ఎనిమిది సంవత్సరాలుగా నా పసిగుండెల్లో అందమైన బొమ్మకట్టిన ఒక వింత అనుభూతి నేడు నిజమవబోతున్న క్షణాలు ఈ సమయంలో మా అమ్మమ్మ గనుక వుంటే ఎంత బాగుండేది! నేను రజస్వల కాకుండానే మా అమ్మమ్మ చనిపోవాలా?

మా యింటిముందు చప్టాలమీద మంచాల్లోంచి నల్లుల్ని రాలగొట్టుతున్న మా అమ్మ నేను గేటు తీసుకుని రావటం చూచింది. ఏంటే బడికెళ్ళకుండా తిరిగి వచ్చావు అని అడిగింది. నా కంగారు చూచి నేనేమీ చెప్పకుండానే నాకేం జరిగిందో పసిగట్టేసింది. నా చేయి పట్టుకుని గదిలోకి తీసికెళ్లింది, నన్ను మళ్ళీ అడిగింది. నేను తలవూపాను.

"కొంప ముంచావు గందే!" అని అమ్మ తల పట్టుకుంది.

దీనిలో కొంపమునిగిందేమిటో, అమ్మ ఎందుకలా తల పట్టుకోవాలో నా కర్థం కాలేదు. అక్కయియ్య లిద్దరూ రజస్వల లయినప్పుడు తెగ హడావుడి పడిపోయిన అమ్మేనా ఈమె? ఎందుకని ఇప్పుడిలా నీరసపడి పోతుంది, ఏమయిందని అలా నీళ్లు కారిపోతోంది?

అమ్మ మొగంలో రకరకాలుగా మారుతున్న భావాలు ఆఖరికి ఒకే భావంగా నిలిచిపోయాయి - ఆమె ఒక నిర్ణయానికొచ్చినట్లు.

"నీ స్నేహితురాళ్ళు ఎవరయినా చూశారా? ఎవరితోనయినా చెప్పావా?" అని అడిగింది.

నేను ఎవరికీ తెలియదని చెప్పాను.

"అమ్మయ్యా, బ్రతికించావు!" అని గుండెలమీద చెయ్యి వేసుకుంది.

ఈ హడావుడికి ప్రక్కగదిలోవున్న అక్కయ్యలిద్దరూ, "ఏంటమ్మా, ఏమయింది!" అని అంటూ వచ్చారు.

అమ్మ చెప్పింది. "ఎక్కడా ఈ సంగతి నోరు జారవాకండి!" అని అమ్మ హెచ్చరించింది.

రాజక్క, "అదేంటమ్మా, ఎవరికీ చెప్పొద్దు అంటావు ఏంటి? పేరంటమూ అదీ, వద్దా?" అని ఆశ్చర్యంగా అడిగింది. అరుణక్క అయోమయంగా చూస్తో నిలబడిపోయింది.

రాజక్క అన్నదానికి అమ్మ దానిమీద మండిపడిపోయింది.

"పేరంటం లేదు, గీరంటం లేదూ. నోరు మూసుకుని వూర్కోండి. గుర్రాల్లాగా ఎదిగి పెళ్ళి పెటాకులు లేకుండా ఒకరికిద్దరు మీరు యింటపడివున్నారుగా చాల్లే- మీకు తోడు. ఇక మూడోది యిది కూడ పెద్దమనిషయి కూర్చుందని తెలిస్తే నలుగురూ ఏమంటారు? ఇక తలెత్తుకుని తిరగక్కర్లేదు!"

అరుణక్క, "అంత తలెత్తుకుని తిరగలేకపోవటానికి మేం ఏం తప్పు చేశామని?" అని రోషంగా అంది.

"తప్పుపని చేయాలా? పెళ్లీడుకెదిగి, పదేళ్లుగా పెళ్లిళ్ళు కాకుండా యింటపడి వున్న కూతుళ్లు ఒకళ్లు కిద్దరున్నారంటే లోకుల దృష్టిలో ఎంత చులకనగా వుంటుంది. మూడోది యిది కూడా పెద్ద మనిషయి కూర్చున్నదని తెలిస్తే వూరుకుంటారా?" అమ్మ ఎంతో బాధగా అంది.

"వూర్కోక ఏం చేస్తారేం?" మళ్లీ అరుణక్కయ్యే కోపంగా అంది.

"ఏం చేస్తారా? కాకుల్ని పొడిచినట్లు పొడుస్తారు. ఈడేరి ఇన్నేళ్ళయింది. అన్నేళ్ళయిందీ అని లెక్కలు కట్టుతారు. పెద్ద మనిషయిన చెల్లెల్లు ఒకరికిద్దరున్నారంటే, పెద్దదానికి ఇంకెన్నేళ్లున్నాయో అని అజ వస్తుంది. పిల్ల ముదిరిపోయిందని పేరు పడిపోయి, అక్కయ్య కొచ్చే సమ్మంధాలు కూడ రాకుండా పోతాయి."- ఈ మాటలు అంటుంటే అమ్మ కళ్ళల్లోకి గిర్రున నీళ్లు తిరిగాయి; ఆమె కంఠం వణికింది.

నీవు బయటికి రాకే అని నాకు చెప్పి అక్కయ్య వాళ్ళిద్దర్నీ బయటికి పంపించింది. కొద్దిసేపు తర్వాత వేడి వేడి పాలు తీసుకుని వచ్చి నాకిచ్చింది.

అమ్మ ఏం చెయ్యదల్చుకున్నదీ నా కర్థమై పోయంది. నేను రజస్వలయిన సంగతి ఎవరికీ తెలియనీయకుండా గుట్టుగా వుంచాలని ఆమె వుద్దేశం.

నేను వారం పదిరోజుల వరకు మళ్లీ బడికి పోలేదు. అమ్మ, నేను బయటికి రాకుండ ఎవరికంటా పడకుండా కనిపెట్టుకుని కూర్చునేది. నా స్నేహితురాళ్లెవరైనా వస్తే నాకు జ్వరం వచ్చిందని అబద్ధ మాడేది. వాళ్ళు, 'ఎలాగుందో చూస్తామండీ!' అంటే, ఇప్పుడే మందు త్రాగి పడుకున్నదని బొంకిఎవర్నీ నా దగ్గరకు రానిచ్చేది కాదు. బయటి వాళ్ళను బయట్నుంచే పంపించేసేది.

నిజంగానే ఆ వారం పదిరోజులు నేను ఖాయిలా పడ్డట్లే అయింది. నా మనస్సంతా దిగులుతో నిండిపోయింది; ఏడ్పు పొర్లి పొర్లి వచ్చేది. అమ్మ చూడకుండా చాటుగా ఏడ్చేదాన్ని. రాజక్క నన్ను వోదార్చేది. ఆ మాటలూ ఈ మాటలూ చెప్పి నన్ను అనునయించేది.

ఆ పది రోజులూ రాజక్క నా దగ్గరే పడుకునేది. నాకు కలలో వోణీలు, పేరంటాలు, మంగళహారతులు, మల్లెపూల జడ, ఫోటో తీయించుకోవడం, జరీ చీర - ఇవన్నీ కనిపించేవి. ఒక రాత్రి

కాడ మెలకువ వచ్చేది. వెక్కి వెక్కి ఏడ్చేదాన్ని. అక్కయ్య నా తలను తన గుండెల కదుముకుని, 'పిచ్చి పిల్లా!' అంటూ ప్రేమగా నా కన్నీరు తుడిచేది.

మధ్యాహ్నప్పూట నేను గదిలో ఒక్కదాన్నే పడుకున్నప్పుడు, ఆ గదిలో మూల అంతకు ముందు అక్కయ్య వాళ్ళు తాటాకుల మీద కూర్చున్న దృశ్యం నా కళ్ళ ముందు మెదిలేది. హాలులో వాళ్ళు కుర్చీలో కూర్చోవటం, అమ్మలక్కలంతా చుట్టూ చేరి హారతులిచ్చి మంగళ హారతులు పాడటం, వాళ్ళు సిగ్గుతో తలలు వంచుకోవటం, నా మనఃపటంలో బొమ్మలుగా కనిపించేవి! ఎంత వద్దనుకున్నా మాటి మాటికి నా చూపులు గోడకు వ్రేలాడుతున్న అక్కయ్యవాళ్ళ ఫోటోల మీదకు వెళ్లేవి! ఆ ఫోటోలు ప్రక్కన నా ఫోటో వుండటం జరగని పని కదా అని అనిపించేంది..... నా లేత గుండెలు అదిరేవి. గుండెల అడుగు నుంచి నా కళ్ళల్లోకి కన్నీరు వూరేది.

ఈ వేడుకల మీద నా మనస్సెందుకింత మోజు పెంచుకున్నది? ప్రతి ఆడపిల్ల జీవితంలో తప్పనిసరిగా జరిగే ఈ ముచ్చట నా విషయంలో ఎందుకని 'కల'గా, అబద్ధంగా మిగిలిపోయింది? దీనికి ఎవరు బాధ్యులు?

- మళ్ళీ నేను బడికెళ్లే రోజున మా అమ్మ నాకెన్నో హెచ్చరికలు చేసింది. ముందు జాగ్రత్తలు మరెన్నో చెప్పింది. కొన్నాళ్ళ దాకా నేను బట్టలు కట్టుకుంటున్న సమయంలో నా దగ్గర నిలబడి, బాడీ ముడి ఎలా గట్టిగా అదిమి కట్టుకోవాలో చెప్పేది. రోడ్డు వెంట నడుస్తున్నప్పుడు పుస్తకాలు ఎలా గుండెల కదిమి పెట్టుకోవాలో సూచించేది. అమ్మ మాటలు వింటుంటే నాకు నవ్వూ వచ్చేది, జాలీ కలిగేది; కోపమూ వచ్చేది.

నన్ను మా అక్కలు లాగా చూడలేదని, నేను రజస్వలయిన సంగతి ఎవరికీ తెలియనీయకుండా కప్పి పుచ్చిందనీ, నేనెంతగానే ముచ్చటపడుతున్న వేడుకలను నాకు జరగకుండా చేసిందనీ నాకు చాలా రోజుల వరకు మా అమ్మ మీద కోపంగా ఉండేది.

కాని, తర్వాత క్రమంగా పెరిగి పెద్దదాన్నవుతున్నకొద్దీ, లోకంతీరు అవగత మవుతున్న కొద్దీ అమ్మ చేసిన దాన్లోని ఆంతర్యం నా కర్థమవుతూ వచ్చింది. మధ్యతరగతి సంసారాల్లో (అందులోనూ ముఖ్యంగా మన వూళ్ళల్లో) పెళ్ళికెదిగి ఇంట పడివున్న ఆడపిల్లలుండటమెంత దుర్భరమో, 'నలుగురూ' ఎంత చులకనగా చూస్తారో నాకు తెలిసి వచ్చింది.

కాని గమ్మత్తు ఏమిటంటే ఈ విషయం ఇలా ఎన్ని సంవత్సరాలు దాచి వుంచుకోగలం? ఒకటి రెండు సంవత్సరాలు మాత్రమే! కాని, ఈ లోపల ఈ విషయం ఇటు అయినవాళ్లల్లో, అటు కానివాళ్లల్లో బయటికి పొక్కకుండా దాచుకోవటం ఎంత దుర్భరమో, ఎన్ని రకాల అవస్థలు పడాలో, ఎన్నిసార్లు ఎన్నిరకాలుగా 'గిల్టీ' ఫీలవుతూ లోపలలోపల కుంచుకుపోవాలో, కుమిలి పోవాలో అనుభవించిన నాలాటివారికి మాత్రమే అర్థమవుతుంది.

కొన్ని రోజులకు (నేనిలా వుండగానే) స్నేహితురాలు కనకం రజస్వల ఐంది. పేరంటంలో ఎవరో, "నీ స్నేహితురాలు కుర్చీ ఎక్కి కూర్చుంది. మరి నీ వెప్పుడు?" అని అనేసరికి నేను నిలువెల్లా

వణికిపోయాను. నా వెంట వున్న మా రాజక్క నా వంక జాలిగా చూచింది.

అలాగే, ఒకరోజు మా రాజక్కకు పెళ్ళిచూపులకని వచ్చినవాళ్లల్లో ఒకామె, "ఇంకా ఈ అమ్మాయి పెద్దమనిషి కాలేదా! ఇప్పుడెన్నో సంవత్సరం?" అని నావంక పట్టి పట్టి చూస్తూ గుచ్చి గుచ్చి అడిగింది.

ఆమె పెళ్ళికొడుకు మేనత్తగారంట. రాజక్కయ్య అతనికి అన్ని విధాల నచ్చింది. కట్న కానుకాదుల్లోకూడ అంగీకారం కుదిరింది. కానీ, ఆ మేనత్త ఆ ఆరాలు ఈ ఆరాలు లాగి అక్కయ్య వయస్సు పాతికేళ్ళు పైన వుంటుందనే నిర్ణయానికి వచ్చింది. ఆవిడ గారి మాటలు విని ఆ పెళ్ళికొడుకు, అంతవరకు అక్కయ్య అందాన్ని చూచి గుటకలు మ్రింగినవాడు, నాకీ పిల్ల నచ్చలేదని తప్పుకున్నాడు. ఆ విధంగా చివరిదాక వచ్చిన సమ్మంధం చేజారిపోయింది.

ఆరోజు అమ్మ నన్ను తిట్టిపోసింది. అసలు నీమూలంగానే సమ్మంధం తప్పిపోయిందని శాపనార్థాలు పెట్టింది. ఆ రోజంతా తిండి తినకుండా ఏడుస్తూ పడుకున్నాను.

ఇకప్పట్నుంచి అక్కయ్యవాళ్ళను చూచుకుంటానికి ఎవరైనా వస్తే నన్ను ఆ ఛాయలు వుండనీయకుండా మా పిన్ని గారింటికి పంపించి వేసేది. ఈ సంఘటనతో అమ్మ చేసినదాన్లో ఎంత ముందు చూపున్నదో నాకు అర్థమైంది.

ఆ తర్వాత మా రాజక్కకు వేరే సమ్మంధం కుదిరి పెళ్ళయిపోయింది. కొన్ని రోజులకు ఎందుకో మా దొడ్డమ్మ గారి ఊరికెళ్ళాం, అక్కడే అమ్మ నాచేత పమిటలు వేయించింది. మా దొడ్డమ్మ గారింటిదగ్గర పెద్దమనిషినయ్యానని ఇక్కడికి వచ్చిన తర్వాత అందరికీ చెప్పింది. ఆ రోజున నిజంగా నా గుండెలమీద నుంచి పెద్ద బరువు దింపుకున్నంత హాయిగా వుంది. ఆనందం పట్టలేక గంతులు వేశాను; పాటలు పాడాను.

...... మరి కొన్నాళ్ళకు (ఐదారేళ్ళకు) నాకు పెళ్ళయింది. సంక్రాంతి పండుగకు మావారు మా ఇంటికి వచ్చారు. అప్పుడు గోడమీద వున్న మా అక్కయ్యల (సమర్త) ఫోటోలు చూచి, మరి నీదేదని అడిగేరు.

ఏం చెప్పను? నిజం చెప్పనా? ఈ కథంతా చెప్పితే - అర్థం చేసుకోగలరా! ఆ పెళ్ళికొడుకు లాగా భయపడిపోయి నాకు విడాకులిస్తే. ఈ మగవాళ్ళందరిలో ఈ పురుగే వుంటుంది. నాకు తెల్సు! అందుకనే ఏమీ చెప్పకుండా అమ్మ పిలుస్తుందని వంకపెట్టి వంటింట్లో కెళ్ళిపోయా.

* * *

హైద్రాబాదులో మావారి పిన్నికూతుళ్ళను చూచేసరికి నాకీ సంగతులన్నీ గుర్తుకు వచ్చాయి.

మాకు హైద్రాబాదుకు ట్రాన్స్ఫరైంది. ఇక్కడ కాపురం పెట్టాం. ఇక్కడే చాలాకాలంగా వుంటున్న మావారి పిన్నిగారింటి కొక రోజున వెళ్లాం. వాళ్ళ కిద్దరు ఆడపిల్లలు. ఇద్దరికిద్దరూ ఏపుగా ఎదిగి చెయ్యెత్తున వున్నారు. పమిటలూ పచ్చిబద్దలూ ఏవీ లేవు. పెద్దపిల్ల 'గురూ షర్టో,' గుండ్రాయి షర్టో వేసుకుంది. రెండోపిల్ల మోకాళ్ళపైకి వున్న మినీ స్కర్ట్ వేసింది.

ఆ పెద్దపిల్లను చూస్తుంటే మరీ ఎబ్బెట్టుగా వుంది. నన్ను తన స్టడీ రూంలోకి తీసికెళ్ళి వాళ్ళ కాలేజి కబుర్లు చెప్తుతోంది.

ఆ పిల్లవంక ఎగాదిగా చూస్తూ, ఒక వుండబట్టలేక, "విజ్జీ, నీవు వోణీలు వేసుకోవా?" అని అడిగేను.

ఆ పిల్ల పాపం నేనిలా అడుగుతానని వూహించివుండదు. నేను కాస్త పెద్ద తరహాగా, "వయస్సు వచ్చిన పిల్లవు ఇలా వుండకూడదమ్మాయి! మీ అమ్మగారైనా చెప్పరా?" అని అన్నాను.

శుద్ధ పల్లెటూరి అవతారాన్ని చూస్తున్నట్లు నావంక చూచి పకపక నవ్వింది.

"ఇప్పుడు వోణీలు వెయ్యటం ఫ్యాషన్ కాదు వదినా, ఇలా వుంటేనే గ్రేస్‌గా వుంటుంది. మా ఫ్రెండ్సంతా యింతే! అసలు మాకు ఈ ఫాషన్లు అన్నీ మమ్మీనే నేర్పింది-" అని అంది.

ఈ మాట వినేసరికి నాకు, బాడీ ముడిగట్టిగా వేసుకోమనీ, రోడ్డు మీద నడుస్తున్నప్పుడు పుస్తకాలు గుండెల కదుముకోమనీ నాకెన్నో హెచ్చరికలు చెప్పిన మా అమ్మ గుర్తుకు వచ్చింది. పిచ్చి అమ్మ!

అప్పుడు నాకు వయస్సును దాచిపెట్టుకోవటం అవసరం! ఇప్పుడు ఈ పిల్లకు వయస్సును ప్రదర్శించుకోవటం ఆకర్షణ! - ఫ్యాషన్నూ!

*- 'జ్యోతి' మాసపత్రిక ఆగష్టు 1974*

★